సస్పెన్స్ కథ

ఎ. లక్ష్మణరావు

# దెయ్యాలున్నాయా!

**'ఛ..! ఇప్పుడే కరెంటు పోవాలా..?' విసుక్కున్నాడు వీరభద్రరావు. అప్పటికే పన్నెండు కార్డులు కిట్టేశాయి. ఎక్స్‌టెన్షన్ కోసం ఎదురుచూస్తున్నాడతను.**

''ఏం..? దగ్గర పడిందా..?'' ఆరా తీశాడు ఆనందరావు. ఫుల్‌కౌంట్‌లో ఉన్నాడతను. డ్రాప్ చెయ్యడానికి మనసొప్పడం లేదు. చేతిలో జోకరు.

''ఇప్పుడెలా?'' ఈశ్వర్రావు సందేహం.

'కేన్సిల్ చేస్తే సరి' ఇరవై మిగిలినా మిగిలామనే మనస్తత్వం కేశవరావుది. మొదటే డ్రాప్ చేశాడతను. నథింగ్ డూయింగ్. కేండిల్స్ తెప్పించు'' వాచ్‌మన్‌ని కేకేశాడు నరేంద్ర. కార్డుషోలో ఉన్నాడతను.

కొద్దిసేపట్లో కొవ్వొత్తులొచ్చాయి. కానీ బయట ఈదురుగాలి. కొవ్వొత్తి నిలవడం లేదు. గట్టిగా తలుపు గడియపెట్టి ఎలాగోలా ఆట అయిందనిపించారు. పెద్దగా ఉరుములు. ఉరుములతోటే మెరుపులు. భారీ వర్షం పడే సూచనగా భయంకరంగా ఉంది వాతావరణం.

''ఇక ఎలాగూ కరెంటు వచ్చే ప్రశ్నలేదు. ఇంటికెళ్ళే ప్రసక్తి లేదు. కాసేపు కబుర్లు చెప్పుకుంటే సరి'' అన్నాడు కమలాకరం.

అతనే క్లబ్ సెక్రటరీ.

''అంతకంటే చేసేదేముంది? కాకపోతే ఈ వాతావరణంలో..'' నసిగాడు నరేంద్ర.

''అదెప్పుడో రడీ చేశాన్రా బాబూ! ఎలాగూ మన కామన్ ఫండ్ ఉందిగా'' అంటూ ''వీరూ...'' అంటూ వాచ్‌మన్‌ని కేకేశాడు కమలాకరం.

హరికేన్ లాంతరు వెలుగులో అయిదు నిమిషాల్లో ఎరేంజ్ చెయ్యబడ్డాయి రాయల్ ఛాలెంజ్ ఫుల్ బాటిల్‌తోపాటు సోడాలు, మిక్చర్ వగైరా. లైట్‌గా మందు సిప్ చేస్తూ కబుర్లలో పడ్డారు మిత్ర బృందం.

''అలా ఎవరి మానాన వాళ్లు కబుర్లు చెప్పుకోవడం కాదు. అందరూ ఒకే సబ్జెక్ట్ మీద డిస్కషన్ మొదలుపెడితే బావుంటుంది'' ప్రపోజ్ చేశాడు ఆనందరావు.

''ఏ విషయం..?''

''ఏదైనా సరే..'' అని కాసేపాగి ''ఒకలా చెయ్యొచ్చు..మనం అంతా నడివయసులో ఉన్నాం. అంటే సగం జీవితం గడిచింది. గతించిన మన లైఫ్‌లో ఏదో ఒక ఇంపార్టెంట్ ఈవెంట్ జరిగుండొచ్చు. అది ఒకరి తర్వాతొకరు వివరించొచ్చు. అఫ్‌కోర్స్! ఇట్ షుడ్ బి ఇంటరెస్టింగ్ టు ఎవ్విరిబడీ''

ఎవరిమట్టుకు వాళ్లే ఆలోచనలో పడ్డారు. ఏవేవో సంఘటనలు కలక్ట్ చేసుకుంటున్నారు. అందులో శృంగారానికి సంబంధించినవే ఎక్కువ. కానీ అవి బయటకు చెప్పాలంటే బిడియం.

అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

''ఓకే ఫ్రెండ్స్! అందరంతా మొహమాట పడుతున్నట్టున్నారు. ఆ చెప్పేదేదో ముందుగా నేనే చెబుతాను'' అన్నాడు ఆనందరావు. అందర్లోకీ అతడే కాస్త మాటకారి. అతడేది చెప్పినా ఇంటరెస్టింగ్‌గానే ఉంటుంది.

''అంతకంటేనా. ఆనందరావుకి జై!'' అన్నాడు ఈశ్వరరావు రెండో రౌండు గ్లాసుల్లోకి వంచుతూ.

మెల్లగా విస్కీ గొంతులోకి దిగుతుంటే శూన్యంలోకి చూస్తూ చెప్పసాగాడు ఆనందరావు.

''ఎప్పుడో ఇరవైయేళ్ల క్రిందటి సంగతి. ఇంటర్మీడియట్ ఫైనల్ ఎగ్జామ్స్ రాశాక ఈవినింగ్ పాసింజర్‌కి మా ఊరు బయలుదేరాను నేను. ఇప్పటిలాగే హోరున గాలి, వర్షం. రాత్రి తొమ్మిదింటికి చేరాల్సిన పాసింజరు నిక్కుతూ నీలుగుతూ గంటన్నర ఆలస్యంగా పదిన్నరకి చేరింది. హడావుడిగా బండి దిగి స్టేషన్ బైటికి వచ్చాను. అనుకున్నట్టే అయింది. రిక్షాగానీ, నాటుబండిగాని ఏదీ లేదు. గుండె ఝల్లుమంది. ఇప్పుడెలా..? కనీసం మూడు కిలోమీటర్లుంటుంది ఊరు. నాతోపాటు దిగిన పాసింజర్లు కూడా లేరు. ఎవరో రైల్వే వాళ్లిద్దరు దిగి స్టేషన్‌లోనే ఉండిపోయారు. అసలు టౌన్ నుండి మా ఊరికొచ్చే పాసింజర్లు రెండే రెండు. ఒకటి పగలు. మరొకటి రాత్రి. మర్నాడు పగలు చేరే బండికి బయల్దేరే వాణ్ణే. కానీ మా తాతగారు మంచాన పడ్డారని, రెండు మూడు రోజుల కంటే బ్రతికే అవకాశం లేదని, అర్జంటుగా నాతో ఏదో మాట్లాడాలనుకొంటున్నారు కాబట్టి ఎగ్జామ్స్ అయిన వెంటనే బయలుదేరి రమ్మని ముందురోజే కబురు అందింది నాకు.

ఇప్పుడెలా..? ఈ రాత్రిపూట లగేజ్‌తోపాటు మూడు కిలోమీటర్లు నడిచివెళ్లడం ఇంపాజిబుల్. పైగా వర్షం ఇక చేసేదేమీ లేదు. స్టేషన్‌లో తెల్లారేవరకు తలదాచుకోక తప్పదు అని వెనుతిరగబోతుంటే అప్పుడు..అప్పుడు జరిగిందా సంఘటన.'' చెప్పటం ఆపి మరోసారి మందు సిప్ చేసి, సిగరెట్ వెలిగించాడు ఆనందరావు. ఆ కాస్త గేప్‌నీ భరించలేకపోయారు శ్రోతలు.

''ఏం జరిగింది?'' అడిగారు ఆత్రుతగా.


''చిన బాబుగారూ! అంటూ ఎవరో గొంతెత్తి పిలిచినట్టనిపించింది. పరికించి చూస్తే ఎవరూ లేరు. స్పష్టంగా వినిపించింది కేక. మరి మనిషి కనపడేం? కాస్త ముందుకి నాలుగడుగులేశాను. అప్పుడు కనిపించింది మసక చీకట్లో ఎడ్లబండి. పక్కన మా పాలేరు రాముడు. తెల్లటి పంచె, లాల్చీ, తలకి చుట్టుకున్న తువ్వాలు. ప్రాణం లేచొచ్చింది. గబగబా దగ్గరికి చేరి 'రాముడూ! నువ్వేనా..? ఇంతాలస్యమయిందేం? స్టేషన్ వరకు రాలేదేం?' ఆత్రుతకొద్దీ అడిగాను కానీ అడిగాక గుర్తొచ్చింది. రాముడు మూగవాడని, సమాధానం చెప్పలేడని. వర్షం కాస్త తగ్గుముఖం పట్టింది. వెన్నెల వెలుగులో పరుగు తీస్తోంది బండి. 'తాతయ్యకెలా ఉంది?' ఆత్రుత పట్టలేక అడిగాను మూగవాడని తెలిసినా. సమాధానం లేదు సరికదా మొహం కూడా తిప్పలేదు. మూగకి తోడు చెవుడు కూడా వచ్చినట్టుంది. ఈ చెవిటి మేళాన్ని అడగడం నాదే బుద్ధి తక్కువ అనుకుంటూ అలసటగా కళ్లు మూసుకున్నాను. లైట్‌గా నిద్రపట్టింది.

స్పీడ్‌గా నడుస్తున్న ఎడ్లబండి హఠాత్తుగా చిన్న కుదుపుతో ఆగిపోయిందొక చోట. ఆ కుదుపునకు తెలివొచ్చింది నాకు. చుట్టూ చూశాను. కాస్త దూరంగా లైట్లు కనిపిస్తున్నాయి. ఊరి పొలిమేరల్లోకి వచ్చేశామన్నమాట. మరి బండి కదలదేం..? ఇంతకీ రాముడేడీ..? 'రాముడూ! రాముడూ!' అని బిగ్గరగా కేకేశాను. సమాధానం లేదు.

రాముడూ! అని బిగ్గరగా కేకేశాను. సమాధానం లేదు.

క్రిందికి దిగి చుట్టూ చూశాను. ఏదో గోతిలో

దిగబడినట్టుంది బండి చక్రం. బహుశా కూలీల్ని పిలవడానికి కష్టం



టాడు. అయినా ఆ సంగతి నాకు చెప్పాలి కదా..! ఒక్క క్షణం కోపం తన్నుకొచ్చింది. అయినా అంతలోనే తమాయించుకున్నాను. పేరుకి పాలేరన్న మాటేగాని చిన్నప్పట్నుంచీ నా బాగోగులు చూసింది అతగాడే. మా అమ్మ చిన్నప్పుడే పోయింది. తాతగారికెప్పుడూ అనారోగ్యమే. తండ్రి ఉన్నాడన్న మాటేగానీ ఎప్పుడూ త్రాగుడు, జూదం, వ్యభిచారం. చాలావరకు ఆస్తి హరించేశాడాయన. మా నాన్నదీ, మేనత్తలదీ ఒకటే ధ్యాస. ముసలాడెప్పుడు పోతాడా..ఆస్తినెలా చేజిక్కించుకుందామా...అని అలాంటి పరిస్థితుల్లో తాతయ్య అవసానదశలో నా ప్రెజెన్స్ ఎంత ముఖ్యమో అని ఆలోచించి, బ్రీఫ్ కేసు తీసుకుని పరుగులాంటి నడకతో పది నిముషాల్లో ఇల్లు చేరుకున్నాను.

నన్ను చూస్తూనే ఆనందంతో వెలిగిపోయింది మా తాతగారి ముఖం. నన్నూ, మరో వ్యక్తిని మాత్రమే అక్కడ ఉండనిచ్చి మా నాన్నతో సహా బంధువులందర్నీ బయటికి పంపించేశారు.

''బాబూ! ప్రాణం పోయేలోగా నిన్నిలా చూస్తాననుకోలేదు. వాళ్లంతా రాబందులు'' అంటూ లేని శక్తి తెచ్చుకుని ఆస్తికి సంబంధించిన వివరాలన్నీ చెప్పి, పక్కనున్న వ్యక్తిని తన ప్రాణమిత్రుడుగానూ, లాయర్‌గానూ పరిచయం చేసి మొత్తం ఆస్తి నాకు చెందేటట్లు రాసిన కాగితాల మీద సంతకాలు చేసి ఆ తెల్లవారు ఝామునే కన్నుమూశారు తాతగారు.''

అంతవరకు చెప్పాక ఓ గ్లాసుడు మంచినీళ్లు త్రాగి-

''సారీ నా స్వంత విషయాలు చెప్పి మిమ్మల్నందర్నీ బోరు కొట్టించినట్టున్నాను. అయితే ఇంత వరకు చెప్పింది ఉపోద్ఘాతం మాత్రమే. అసలు కథ ఇప్పుడు మొదలవుతుంది'' అన్నాడు ఆనందరావు.

''ఈజిట్.. కేరీ ఆన్'' అన్నాడు ఫ్రెండ్స్ ఉత్సాహంగా.

''తాతయ్య పోవడం, ఏడుపులు (అందులో కొన్ని కృత్రిమం) దహన సంస్కారం, బంధుమిత్రుల రాకపోకలు. కర్మకాండ వగైరా రకరకాల హడావుడిలో పడి పాలేరు రాముడు ఏమయ్యాడన్న విషయం పట్టించుకోలేదు నేను. హడావుడి కాస్త తగ్గాక, అందరి సమక్షంలో మా మామయ్య ఒకాయన (మేనత్త భర్త) హఠాత్తుగా అడిగాడు నన్ను.

''అది సరేగానీ ఆనందం..! ఆ రోజు రాత్రి..అదే మా మావయ్యగారు బ్రతికున్నరోజు రాత్రి, నీకోసం స్టేషన్‌కి మోటార్ సైకిల్‌మీద మనిషిని పంపిస్తే వాడు తిరిగి రానేలేదు. మర్నాడు తెలిసింది. వెళ్లేటప్పుడు వర్షంలో బండి స్కిడ్ అయి అతగాడికి ఏక్సిడెంట్ జరిగి హాస్పిటల్లో ఎడ్మిట్ అయ్యాడని. మరి అంత వర్షంలో చీకటిలో నువ్వెలా చేరుకున్నావు ఇంటికి?''

''అదేమిటి? నాకోసం ఎడ్లబండి పంపించారుగా..? అందులో వచ్చాను'' అన్నాను విస్మయంగా.

''ఎడ్లబండా..? ఎవరు తోలుకొచ్చారు..?''

''రామయ్య..మన పాలేరు రామయ్య..అదే రాముడు.''

''ఆ..!'' అదిరిపడి ముఖముఖాలు చూసుకున్నారక్కడ కూచున్నవాళ్లు.

''అలా ఆశ్చర్యపోతారెందుకు? ఇంతకీ రాముడేడీ? ఊరెళ్లాడా?'' అయిదు నిముషాల వరకు మాట్లాడలేదెవ్వరూ.

''రాముడు ఏమయ్యాడంటే మాట్లాడరేంటి?'' గద్దించాను నేను.

''అది..అది..అదే..ఊరెళ్లాడు'' గొణిగింది

మా మేనత్త.

కాని నమ్మశక్యంగా లేదావిడ మా... ఏం జరిగింది? అంతా అయోమయంగా ఉంది.

అప్పుడు కలగజేసుకున్నారు లాయర్ ప్రకాశరావుగారు. ''కమాన్ ఆనంద్! లెటజ్‌గో...'' అంటూ నన్ను బలవంతంగా మేడమీది గదిలోకి తీసుకెళ్లారాయన.

''ప్లీజ్ రిలాక్స్ మైబోయ్! ఇప్పుడు చెప్పు. ఆ రోజు స్టేషన్‌కి ఎడ్లబండి తీసుకొచ్చింది మీ పాలేరు రాముడేనా..?''

''ఎస్ సార్!''

''కచ్చితంగా చెప్పగలవా? ముఖాన్ని సరిగ్గా చూశావా? నీతో ఏమైనా మాట్లాడాడా?'' సూటిగా అడిగారు లాయర్ గారు.

''చూశావా..అంటే చూసినట్టే (గుర్తు తెచ్చుకుంటూ) ఆఫ్‌కోర్స్..తువ్వాలు తలకి చుట్టుకున్నాడు. ఇక మాటలంటారా? తను మూగవాడు కదా..?''

''ఆఫ్‌కోర్స్. ఆ విషయం మర్చిపోయాను నేను. మరి నీతోపాటు రాముడు ఇంటివరకు రాలేదేం?'' సూటిగా అడిగారు ప్రకాశరావు.

''మధ్యలో మాయమయ్యాడు అంకుల్! ఓ చోట బండి చక్రం మొరాయించింది. అక్కడ రాముడి జాడలేదు. కాసేపు తనకోసం చూసి నేను ఇంటికొచ్చేశాను.

''ఐ..సీ! ఆ చోటు..అంటే బండి మొరాయించిన చోటు స్మశానానికి దగ్గరగా ఉంది కదూ?''

''అనుకుంటాను. ఎందుకలా అడుగుతున్నారు'' అన్నాను కుతూహలంగా.

ప్రకాశరావుగారు కాసేపు దీర్ఘంగా ఆలోచించి..

''యస్. ఇప్పుడర్థమయింది. ఆ రోజు నీ బండి నడిపింది రాముడు కాదు. రాముడి ఆత్మ'' ఆ మాట వింటూనే మిత్రుల శరీరాలు కూడా బరువెక్కాయి.


''వ్వాట్..?'' అదిరి పడ్డాను నేను.

''యస్ మై బోయ్! అంతకు రెండ్రోజుల క్రితం చనిపోయిన రాముడు ఎడ్లబండి ఎలా తోల్తాడు?

''ఏమిటి..? రామయ్య చనిపోయాడా?'' ఖంగుతిన్నాను నేను.

''యస్. చనిపోయాడో చంపబడ్డాడో ఆ భగవంతుడికే తెలియాలి. పొలంలో శవంగా తేలాడు రాముడు. ప్రత్యర్థులు 'పాముకాటు' అని నమ్మించారు ప్రజల్నీ అతని కుటుంబ సభ్యుల్నీ.

''మైగాడ్. ఘోరం..ఎవరు? ఎవరీ పని చేశారీ పని?'' ఆవేశంగా అడిగాను




నేను.''ఎవరంటే ఎవరని చెప్పను. నీ బంధువర్గంలోని వాళ్లే. మీ తాతగారు బ్రతికుండగా నువ్వు రావడం ఇష్టం లేదు వాళ్లకి. అంతా ఆస్తికోసం పన్నాగం. డబ్బుమీది ఆశ ఎంతపనైనా చేయిస్తుంది. మరో విషయం తెలుసా నీకు? నా ఊహ కరక్ట్ అయితే ఆ మోటార్ సైకిలిస్ట్ స్టేషన్‌కి చేరకుండా అడ్డుకున్నది కూడా రాముడి ఆత్మే. ఏ దయ్యం రూపంలోనో అతనికి కనిపించి భయపెట్టి ఏక్సిడెంట్ అయేటట్టు చేశాడు'' అన్నారు లాయర్‌గారు. దయ్యం మాట వింటూనే..''

అమ్మో... దయ్యమా..ద..ద.. దయ్యాలున్నాయా?' గజగజ వణుకుతున్నాడు కేశవరావు. కొట్టిన మందు మొత్తం దిగిపోయింది. బయటికి చెప్పకపోయినా మిగతావాళ్ల పరిస్థితీ అలాగే ఉంది.

''నో.... ..దయ్యం లేదు..భూతం లేదు. అంతా భ్రమ. నిజానికా విషయంలో లాయర్ అంకుల్‌తో విభేదించాను నేను. ఇంతగా సైన్స్ డెవలప్ అయ్యాక ఈరోజుల్లో కూడా దయ్యాల్ని భూతాల్ని నమ్మడమేమిటి సార్! అయినా చనిపోయినవాడు తిరిగి రావడమేమిటి? అబ్సర్డ్''

''నో మై బోయ్. అక్కడక్కడ అత్యవసర పరిస్థితుల్లో ఆత్మలు ఇంటర్‌ఫియర్ అయి ప్రజలకి మేలు చేసినట్టు చరిత్ర చెబుతోంది'' అని కన్విన్స్ చెయ్యబోయారు ప్రకాశరావుగారు.

కానీ నేను ససేమిరా నమ్మలేదు.

''మరి ఎడ్లబండి తోలిన మనిషి మోటారిస్ట్‌ని అడ్డుకున్న వ్యక్తీ ఎవరంటావ్?'' అడిగాడు వీరభద్రరావు.

''బండి తోలిన మనిషి రామయ్య పోలికలతో ఉన్న అతని తమ్ముడో మరొకరో కావచ్చు. ఇక మోటారిస్ట్ విషయానికొస్తే రామయ్య చావులో అతని హస్తం ఉండొచ్చు. ఆ పాపభీతితో రాత్రిపూట ఒంటరిగా ప్రయాణం చేస్తున్న వ్యక్తి ఎవర్ని చూసినా రామయ్య దయ్యంగా భ్రమపడే అవకాశం ఉంది. ఆ తడబాటులో ఏక్సిడెంట్ జరిగుండొచ్చు. మీకు ఇంకా భయమనిస్తే మరో బాటిల్ తెప్పించి తలో పెగ్గు లాగించండి. అంతేగాని దయ్యాలు-భూతాలు అంటూ నన్ను నమ్మించే ప్రయత్నం చెయ్యొద్దు'' అన్నాడు ఆనందరావు ఫర్మ్‌గా.''అయితే దయ్యాలసలు లేవంటారు?'' అడిగిందో బొంగురు గొంతు.

''ఈ కొత్త గొంతు ఎవరిదా?'' అని తలలు తిప్పి చూశారందరూ.''అరె..భాస్కర్! నువ్వెప్పుడొచ్చావిక్కడికి?'' అడిగారు కోరస్‌గా.

''ఇప్పుడే. దయ్యాల చర్చ మొదలైనప్పుడు''

''అదేమిటి? బోర్డర్స్‌లో తీవ్రస్థాయిలో యుద్ధం మొదలయిందని విన్నామే..ఈ పరిస్థితిలో సెలవు ఎలా దొరికింది నీకు? కొంపతీసి అస్త్రసన్యాసం చేశావా ఏమిటి? సాధువులా వైట్ డ్రెస్ ఏమిటి?'' అడిగాడు ఈశ్వరరావు. చిరునవ్వే సమాధానం.

కాసేపట్లో కరెంట్ వచ్చింది. మిత్రులు లేవబోతుంటే-

''రెండు నిముషాల్లో 'వార్'కి సంబంధించిన స్పెషల్ బులెటెన్ వస్తుంది. వినేసి పోదాం'' అన్నాడు కమలాకరం టి.వి. ఆన్ చేస్తూ.

''సరిహద్దుల్లో హోరాహోరీగా యుద్ధం మొదలైందని చెబుతూ- ఇప్పుడే అందిన దుర్వార్త. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన 'కడియాల భాస్కర్' అనే జె.సి.వో. నిన్న సాయంకాలం కార్గిల్ సెక్టార్‌లో జరిగిన యుద్ధంలో వీరమరణం చెందాడని చెప్పడానికి చింతిస్తున్నాం. అతని డెడ్ బాడీని..''మరేమీ వినిపించలేదు శ్రోతలకి. అంతకుముందు భాస్కర్ కూర్చున్న కుర్చీవైపు చూశారు.

ఖాళీ!

ఇంతకీ గట్టిగా గడియపెట్టి ఉన్న తలుపులోంచి భాస్కర్ ఎలా వచ్చాడు..? అంటే..?

''ఆ..!!!'' అంటూ నోరెళ్లబెట్టారు మిత్రులంతా.

